సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం | 5 | నవంబర్ | 2023



శ్రీనివాసా.. గోవిందా..

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. దీపావళి ముందు రోజులు కావడంతో భక్తుల తాకిడి తక్కువగా కనిపించింది.



ఆక్వాకు మరింత ప్రోత్సాహం

ఆక్వా రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు.

8లో ▸



విభిన్నంగా ఆలోచించాలి

విద్యార్థులు విభిన్నంగా ఆలోచించాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి అన్నారు. నిట్‌లో టెక్రియ వేడుకలు ముగిశాయి.

8లో ▸

న్యూస్‌రీల్

సీఎం జగన్‌తో అన్ని వర్గాలకూ న్యాయం



మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జర్నలిస్టులు

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో రాష్ట్రంలో అన్ని వర్గాలకూ మేలు జరుగుతుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు 3 సెంట్ల స్థలం ఇవ్వాలని కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలపడంతో శనివారం తణుకులో మంత్రి కారుమూరిని జర్నలిస్టులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పాదయాత్రలో భాగంగా జర్నలిస్టులకు ఇంటి స్థలం ఇస్తానన్న జగన్‌మోహన్‌రెడ్డి హామీని నెరవేరుస్తున్నారని మంత్రి కారుమూరి అన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే వ్యక్తిగా ప్రజల గుండెల్లో జగన్ నిలిచిపోయారన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్ : ఇంటి స్థలం కోసం ఏళ్ల తరబడి వేచిచూస్తున్నామని, ఈ సమస్యను సీఎం జగన్ పరిష్కరిస్తుండటం చాలా సంతోషంగా ఉందని తణుకు ప్రెస్‌క్లబ్ విలేకరులు అన్నారు. 3 సెంట్ల స్థలం ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలపడంతో సీఎం జగన్, మంత్రి కారుమూరికి ప్రత్యేకంగా థ్యాంక్స్ చెబుతున్నట్టు చెప్పారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, విలేకరులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామని జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారత అధికారి బి.సుజాత రాణి ఓ ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పోస్టులు భర్తీ చేయనున్నారని పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి, ప్రొటెక్షన్ అధికారి (ఇనిస్టిట్యూషనల్), (నాన్ ఇనిస్టిట్యూషనల్), లీగల్ కమ్ ప్రొబిషన్ ఆఫీసర్, సోషల్ వర్కర్, డేటా అనలిస్ట్, అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఔట్ రిచ్ వర్కర్ పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. అలాగే ఎస్ఏఏకు సంబంధించి మేనేజర్/కో-ఆర్డినేటర్, సోషల్ వర్కర్/ఎర్లీ చైల్డ్ ఉడ్, నర్సు, డాక్టర్ (పార్ట్‌టైమ్), ఆయాలు, చౌకీదార్ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో http://westgodavari.ap.gov.in ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే అంగన్‌వాడీ పోషణ 2.0 కింద డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్-1, ప్రాజెక్ట్ అసిస్టెంట్-1, బ్లాక్ కో-ఆర్డినేటర్-2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, దరఖాస్తులు భీమవరం జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి, సాధికారత అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంటాయన్నారు.

పటిష్టంగా జగనన్న ఆరోగ్య సురక్ష

జగనన్న ఆరోగ్య సురక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా నమోదైన కంటి శుక్ల ఆపరేషన్లను సకాలంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని కలెక్టర్ పి.ప్రశాంతి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డిని కోరారు. శనివారం విజయవాడ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష, మహిళా శిశు సంక్షేమం, విద్యార్థుల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్, బాల్య వివాహాల నివారణ, నాడు-నేడు, జగనన్నకు చెబుదాం అంశాలపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో కంటి శుక్లాల ఆపరేషన్లకు సుమారు 2,586 కేసులు నమోదయ్యాయన్నారు. జిల్లాలో ఆరోగ్య సురక్ష క్యాంపులు పటిష్టంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ఇంటర్ ఫెయిలైన వారికి శుభవార్త

పాసైతే సప్లిమెంటరీకి బదులు రెగ్యులర్ సర్టిఫికెట్

- ఈ ఏడాది నుంచి అమలు
- 2021-22, 2022-23లో ఫెయిలైన విద్యార్థులకు అవకాశం
- నెలాఖరు వరకు ఫీజు చెల్లింపులకు గడువు
- తరగతులకు హాజరు కావొచ్చు
- అమ్మఒడి పథకానికీ అర్హత



ఇంటర్మీడియెట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

2021-22, 22-23లో ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు

జిల్లా	జనరల్ విద్యార్థులు	ఒకేషనల్ విద్యార్థులు
ఏలూరు	4,232	1,174
పశ్చిమగోదావరి	4,422	1,123
తూర్పుగోదావరి	1,206	451
మొత్తం	9,860	2,748

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం సంస్కరణలకు నాంది పలికింది. విద్యార్థుల అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన విధానాలను అమలు చేస్తున్నారు. అమ్మఒడి, మనబడి నాడు-నేడు, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద వంటి పలు పథకాలను ప్రవేశపెట్టి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఇంటర్మీడియెట్‌లో ఫెయిలైన విద్యార్థులను కూడా రెగ్యులర్ విద్యార్థులుగా గుర్తించే విధానాన్ని అమలుచేయనున్నారు. ఇది ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు సదవకాశంగా భావించవచ్చు.

ఈ ఏడాది నుంచి నూతన విధానం

ప్రతి విద్యార్థికీ ఇంటర్ చదువు మైలురాయి. ఇంటర్ పూర్తి చేస్తే ఉన్నత స్థితిలో స్థిరపడడానికి అనువైన విద్యను ఎంచుకునే అవకాశం ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యమున్న ఇంటర్‌ను పూర్తిచేయడానికి పలువురు విద్యార్థులు తంటాలు పడుతున్నారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన వారిలో దాదాపు 30 నుంచి 40 శాతం మంది సానుకూల ఫలితాలు సాధించలేకపోతున్నారు. అటువంటి వారి కోసం ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నా వాటిలో కొంతమంది తప్పి వచ్చే ఏడాది వరకూ ఎదురుచూడాల్సి వస్తోంది. అటువంటి వారి కోసం ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ద్వితీయ సంవత్సరం పరీక్షలు తప్పిన విద్యార్థులు మరోసారి కళాశాలలో చేరవచ్చు. తరగతులకు హాజరుకావచ్చు, రెగ్యులర్ విద్యార్థులుగా మారిపోవచ్చు.

2021-22, 22-23 విద్యార్థులకు అవకాశం

ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఈ విధానంతో 2021-22, 22-23 విద్యా సంవత్సరాల్లో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియెట్ తప్పిన విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఇంటర్మీడియెట్ బోర్డు అధికారుల గణాంకాల ప్రకారం పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలో ఈ రెండేళ్లలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో తప్పిన విద్యార్థులు 9,860 మంది జనరల్, 2,748 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు.

అమ్మఒడి పథకానికీ అర్హత

నూతన విధానంలో రెగ్యులర్ విద్యార్థులుగా ఫీజులు చెల్లించి తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వం అమ్మఒడి పథకం లబ్ధిని అందిస్తోంది. అయితే వారు గతంలో కూడా అమ్మఒడి పథకాన్ని అందుకున్న వారై, ప్రస్తుత సంవత్సరంలో కూడా ఆ పథకానికి అర్హతలు కలిగి ఉండాలి. ఈ మేరకు పూర్వ పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో గత రెండు విద్యా సంవత్సరాల్లో ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులు 12,608 మంది ఉండగా వారందరికీ పథకం అర్హత లభిస్తే ప్రభుత్వంపై రూ.16.39 కోట్ల అదనపు భారం పడనుంది. అయితే ఈ మొత్తాన్ని భారంగా కాక విద్యార్థుల అభ్యున్నతి కోసం ఖర్చు చేస్తున్నట్లు ప్రభుత్వం భావించి వారికీ ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం నూతనంగా ఈ ఏడాది నుంచే ప్రారంభించిన ఈ విద్యా విధానంలో ఫీజులు చెల్లించిన విద్యార్థులు రెగ్యులర్ విద్యార్థుల్లా తరగతులకు హాజరై పాఠాలను వినే అవకాశం కల్పిస్తాం. అలా తరగతులకు హాజరైతే మరోసారి ఆయా సబ్జెక్టులపై పట్టు పెరుగుతుంది. తద్వారా పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యే అవకాశాలు పెరుగుతాయి. గతంలో పరీక్షలు తప్పి సప్లిమెంటరీ రాసిన విద్యార్థులకు పాస్ సర్టిఫికెట్‌లో సప్లిమెంటరీ విద్యార్థులుగా నమోదు చేసేవారు. నూతన విధానంలో అయితే అలాంటి విద్యార్థి ఉత్తీర్ణుడైతే అతనికి కూడా రెగ్యులర్ విద్యార్థిగానే పాస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. దీనిపై ఇప్పటికే ప్రిన్సిపాళ్లకు అవగాహన కల్పించాం. వారి పరిధిలో ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులతో ఫీజులు కట్టించేలా చైతన్యపరుస్తున్నాం. ఈ మేరకు దాదాపు 60 శాతానికి పైగా విద్యార్థులు ఫీజులు చెల్లించారు. మిగిలిన వారు కూడా నెలాఖరులోపు ఫీజులు చెల్లించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కె.చంద్రశేఖరబాబు, ప్రాంతీయ పర్యవేక్షకుడు, ఇంటర్మీడియెట్ బోర్డు

ధాన్యం కొనుగోళ్లకు పటిష్ట చర్యలు

కలెక్టర్ ప్రశాంతి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడటంతో పాటు తప్పు జరిగితే చర్యలు కచ్చితంగా ఉంటాయని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. గన్నీ బ్యాగులను రైతులకు ప్రణాళికాబద్ధంగా అందించాలని, ఈ విషయంలో మిల్లర్లు సహకరించాలని కోరారు. ఎఫ్ఏక్యూ ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామన్నారు. ఈ సీజన్‌లో రూ.460 కోట్ల బ్యాంక్ గ్యారంటీలు అవసరమని, దీనిలో రూ.100 కోట్ల బ్యాంక్ గ్యారంటీలను సోమవారం నాటికి అందజేయాలని రైస్ మిల్లర్ అధ్యక్షులను కోరామన్నారు. ధాన్యం రవాణాకు 1,428 వాహనాలకు జీపీఎస్ అమర్చామని, ఆర్బీకేల వారీగా వాహనాల వివరాలను వీఆర్వోలు వెంటనే సమర్పించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లపై రైతుల్లో అవగాహన కలిగించేందుకు మూడు నిమిషాల నిడివి గల వీడియోను వాట్సాప్ ద్వారా పంపడంతో పాటు ఆర్‌బీకేల్లో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం సేకరణ సమయంలో కస్టోడియన్ అధికారి తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రక్రియను ఆర్డీఓలు, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ధాన్యం రవాణా వాహనాలను పక్కాగా పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో 314 ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. క్వింటా ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, కామన్ రకానికి రూ.2,183లు ధర నిర్ణయించారన్నారు. జేసీ ఎస్.రామసుందర్ రెడ్డి, ఆర్డీఓలు ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, కె.శ్రీనివాసులురాజు, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, డీఎస్‌ఓ ఎస్.సరోజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా రైసు మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు నిందలు వేయడం తప్ప అభివృద్ధి కనిపించదు

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున



చింతలపూడి : ప్రతిపక్ష పార్టీ నాయకులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నిందలు వేయడం తప్ప రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కనిపించడం లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున మండిపడ్డారు. ఏలూరు జిల్లా చింతలపూడిలో శనివారం ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం పునాది రాళ్లు వేయడం.. వెళ్లిపోవడం, అది జగన్ ప్రభుత్వం పూర్తి చేస్తే టీడీపీనే మంజూరు చేసిందని చెప్పుకోవడం ఆ పార్టీ నేతలకు అలవాటుగా మారిందన్నారు. చింతలపూడి గురుకుల పాఠశాల ఇందుకు ఉదాహరణని ఆయన చెప్పారు. గత ప్రభుత్వంతో పోల్చితే, ఈ ప్రభుత్వంలో రాష్ట్రంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏవిధంగా ఉన్నాయో కూడా ప్రజలు గమనించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం సీఎం వైఎస్ జగన్ లక్షా 67 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారన్నారు. చంద్రబాబు హయాంలో ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లిందో చెప్పాలని నిలదీశారు. త్వరలో ఎన్నికలు రానున్నాయని, ప్రజలను మోసం చేయడానికి ప్రతిపక్ష పార్టీల నాయకులు మళ్లీ వస్తారని, జగన్‌మోహన్‌రెడ్డిపై నిందలు వేస్తారని మంత్రి చెప్పారు. ప్రజల పక్షం అయిన జగన్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. జగన్ మా నాయకుడంటూ మీరు ముందుండి.. ప్రతిపక్షాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నేను పేదల పక్షపాతిని, పెత్తందారులకు కాదని చెప్పే ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. అంబేడ్కర్ భావజాలం ఈ రాష్ట్రంలో అమలు జరగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఉందన్నారు. ఓటు అనేది పవిత్రమైనదని, ఓటు విలువను కాపాడుకుని పేదల పక్షపాతి, పేదల అభ్యున్నతి కోసం, భావితరాల భవిష్యత్తు కోసం, నిరంతరం శ్రమిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి వెంట మీరంతా ఉండాలని కోరారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు దళితుల మీద జరిగిన దాడులు, అఘాయిత్యాలు ఎన్నో చూశామన్నారు. స్వయంగా సీఎంగా ఉన్న చంద్రబాబు సైతం ఎస్సీ కులంలో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని చెప్పడం చూశామని గుర్తుచేశారు. చివరకు మహిళలను వివస్త్రను చేస్తే మాట్లాడనివారు, మాదిగ సోదరులను చెట్టుకు కట్టి కొడితే నోరు మెదపని వారికి 2019 ఎన్నికల్లో ప్రజలు ఏవిధంగా బుద్ధిచెప్పారో గుర్తు పెట్టుకోవాలన్నారు. 2019 తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల స్థితిగతులు ఏ విధంగా మారాయో ప్రజలు తెలుసుకోవాలన్నారు. కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అభివృద్ధి జరుగుతోందని, సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందిస్తున్నామని చెప్పారు. రాజకీయాలకతీతంగా సామాజిక విప్లవానికి తెరతీసిన జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశంలో ఒక మచ్చుతునక అని మంత్రి నాగార్జున చెప్పారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు

ఆకివీడు: ఆన్‌లైన్ మోసంపై అజ్జమూరుగరువు ప్రాంతానికి చెందిన యువతి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగబాబు చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అనన్య అనే యువతి వర్క్ ఫ్రం హోం విధానంలో ఓ యాప్ ద్వారా పనిచేసింది. ఆన్‌లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చేసిన పనికి సొమ్ములు రావాలంటే కొంత మొత్తం చెల్లించాలని ఆమెను నమ్మించారు. దీంతో ఆమె పలు దఫాలుగా రూ.1.07 లక్షలు వారి ఖాతాకు జమచేసింది. అయితే చేసిన పనికి సొమ్ములు, తాను చెల్లించిన మొత్తం తిరిగి రాకపోవడంతో మోసపోయినట్టు గుర్తించి పోలీసులను ఆశ్రయించింది. ఆన్‌లైన్ యాప్‌లు ఓపెన్ చేయవద్దని, యాప్‌ల ద్వారా సొమ్ము కాజేస్తున్న సైబర్ నేరగాళ్లు పెరిగిపోయారని ఎస్సై నాగబాబు చెప్పారు.

పారదర్శకంగా పథకాల అమలు

మంత్రి కారుమూరి



కె.సముద్రపుగట్టులో ఇళ్ల పట్టాలు అందిస్తున్న మంత్రి కారుమూరి, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

అత్తిలి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా పేదలకు అందడంతో రాష్ట్రంలో పేదరికం 6 శాతానికి తగ్గిందని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం కె.సముద్రపుగట్టు గ్రామంలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థలాలకు సంబంధించి గతంలో కోర్టులో కేసు ఉండటంతో పట్టాల మంజూరులో జాప్యం జరిగిందన్నారు. లబ్ధిదారులకు ఇంటి పట్టాతో పాటు గృహం నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తుందని చెప్పారు. గత టీడీపీ పాలనలో పేదలకు పంచాల్సిన సొమ్ములు టీడీపీ పెద్దల జేబుల్లోకి వెళ్లాయని విమర్శించారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పెద్దెత్తున ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. గ్రామాభివృద్ధికి జిల్లాపరిషత్ నిధుల నుంచి రూ.8 లక్షలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. గ్రామంలో 40 మందికి ఇళ్ల పట్టాలను అందజేశారు. ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, సర్పంచ్ బండి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ అద్దంకి శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బ్యాంకు చోరీ కేసును ఛేదించిన పోలీసులు



అధికారులు, సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

నరసాపురం: నరసాపురం పట్టణం ఎస్‌బీఐ బజార్ బ్రాంచ్‌లో ఈనెల 1న జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఆ వివరాలను జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ శనివారం స్థానిక టౌన్ సీఐ కార్యాలయంలో విలేకర్లకు వెల్లడించారు. బ్యాంకు క్యాషియర్ మరో మహిళా ఉద్యోగిని డబ్బులు లెక్కిస్తుండగా నరసాపురం మండలం రుస్తుంబాదకు చెందిన సెంట్రింగ్ పనిచేసే తానేటి సురేష్‌బాబు (54) కత్తితో బెదిరించి రూ.6.50 లక్షల నగదు కాజేసినట్టు గుర్తించామన్నారు. గతంలో ఇతనికి నేరచరిత్ర లేదని, అప్పులు పాలుకావడంతోనే చోరీకి పాల్పడ్డాడని తెలిపారు. సురేష్‌బాబు తన అప్పులు తీర్చుకోవాలనే ఉద్దేశంతో గతంలో గోల్డ్ లోన్ తీసుకున్న ఎస్‌బీఐ బజార్ బ్రాంచ్‌లో చోరీకి ప్లాన్ చేశాడన్నారు. గత నెల 30, 31 తేదీల్లో బ్యాంకుకు వచ్చి రెక్కీ నిర్వహించాడు. బ్యాంకులో మహిళా ఉద్యోగులు తప్ప ఎవరూ ఉండటంలేదని గుర్తించి ఈనెల 1న చోరీకి పాల్పడ్డాడని చెప్పారు. చోరీకి ఉపయోగించిన కత్తి ఆధారంగా కేసును ఛేదించామన్నారు. పట్టణంలోని ఎండు చేపల మార్కెట్ వద్ద ఓ కత్తుల దుకాణంలో కత్తి కొనుగోలు చేసినట్టు తెలిపారు. చోరీ సొత్తు రూ.6.50 లక్షలు రికవరీ చేశామని, నిందితుడిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్పీ చెప్పారు. కేసు ఛేదనలో చురుగ్గా వ్యవహరించిన అధికారులు, కానిస్టేబుల్స్‌కు రివార్డులు ఇస్తామని ప్రకటించారు.

ఆక్వా రంగానికి ప్రోత్సాహం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



భీమవరంలో ఆక్వాఎక్స్‌పోలో పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి

సాక్షి, భీమవరం: ఆక్వారంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని రైతులు నూతన టెక్నాలజీని ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలని పౌరసరఫరాలు, వినియోదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. భీమవరంలో ఆక్వా ఫార్మింగ్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మూడు రోజుల ఆక్వా ఎక్స్‌పో శనివారం ముగిసింది. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి ఎక్స్‌పోను సందర్శించి మాట్లాడారు. గతంలో రొయ్యల సాగు అనేక ఒడుదుడుకులతో సాగేదని, కరోనా వైరస్ సమయంలో ఇతర దేశాలకు ఎగుమతులు లేక, ధర లేక రొయ్యల రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 100 కౌంట్ రొయ్యలు కిలో రూ.210 తగ్గకుండా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. ఆక్వా చెరువులకు ఆక్వా జోన్స్‌తో ప్రమేయం లేకుండా 10 ఎకరాల్లోపు రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ అందించేందుకు నిర్ణయించారని చెప్పారు. రొయ్యల ధరలు తగ్గకుండా, మేతల ధరలు పెంచకుండా మంత్రులు, మత్స్యశాఖ అధికారులు, ఫీడ్, సీడ్ కంపెనీల యజమానులు, రైతులతో సాధికారత కమిటీని ఏర్పాటుచేసి ప్రతి 15 రోజులకు రొయ్యల ధరలు నిర్ణయించేలా చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం అమెరికా వంటి దేశాల్లో రొయ్యల దిగుమతులపై పన్నులు పెంచుతున్నట్టు తెలిసిందని, దీనిపైనా ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పన్నులు పెరగకుండా రైతులకు మేలు చేసే విధంగా చర్యలు తీసుకుంటారని మంత్రి వెల్లడించారు. రొయ్యలు, చేపల సాగులో రైతులు అధునాతన పద్ధతులను అవలంభించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందాలని సూచించారు. దీనికి మార్కెట్‌లో ఉన్న వివిధ రకాల యంత్రాలు, ఫీడ్, మందులు తదితర విషయాలను తెలుసుకొనేందుకు ఎక్స్‌పోలు దోహదం చేస్తాయని అన్నారు. ఎక్స్‌పోలో వివిధ దేశాలకు చెందిన యంత్రాలు, ఇతర ఉత్పత్తులు ప్రదర్శించారని, ఇందులో మన ప్రాంతానికి అనువైన తక్కువ ధరకు మన్నికతో కూడిన యంత్రాలను ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. ఆక్వా ఫార్మింగ్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ సీఈఓ దంతులూరి వేణు లాభాపేక్షతో కాకుండా సొంత ప్రాంతంలో రైతులకు ఉపయోగపడాలనే సంకల్పంతో మూడేళ్లుగా ఇటువంటి ఎక్స్‌పోలు నిర్వహించడం అభినందనీయమని మంత్రి కారుమూరి కొనియాడారు.

విద్యార్థులు విభిన్నంగా ఆలోచించాలి

నిట్ టెక్రియలో రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి



నిట్‌లో ప్రదర్శనలు ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు



నిట్ విద్యార్థులు ప్రదర్శించిన ఎక్స్‌పో

తాడేపల్లిగూడెం: విద్యార్థులు విభిన్నంగా ఆలోచించాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి సూచించారు. నిట్‌లో ఏర్పాటుచేసిన రెండు రోజుల టెక్రియ 2023 వేడుకలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా శంకరరెడ్డి మాట్లాడుతూ కొత్త తరహా ఆలోచనా విధానాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని, ఇది జీవితంలో ఒక భాగం కావాలని అన్నారు. ఇలాంటి ఆలోచనా విధానం విద్యార్థుల వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దడంతో పాటు చుట్టుపక్కల ఉన్నవారికి ఒక ధర్మం చూపించే విధంగా ఎదుగుతారని చెప్పారు. వైజ్ఞానిక ప్రాజెక్టుల కోసం శాస్త్రజ్ఞులు ఏళ్లపాటు అంకితభావంతో పనిచేస్తారని అలాంటి వారి స్ఫూర్తితో విద్యార్థులు ప్రయోగాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భిన్నమైన ఆలోచన దృక్పథంతో చరిత్రలో నిలిచిపోయే ఆవిష్కరణలు ఊపిరిపోసుకుంటాయని వివరించారు.

ఆకట్టుకున్న స్టార్టప్ ప్రదర్శనలు

స్టార్టప్ 20 ఎక్స్‌పో కార్యక్రమం ఆకట్టుకుంది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 17 ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 75 టీములు తమ ప్రాజెక్టులను ప్రదర్శించాయి. 5 ఉత్తమ ప్రాజెక్టులను ఎంపికచేసి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి పర్యవేక్షణలో జరిగింది. నిట్‌లోని 8 ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ల అసోసియేషన్లు, 17 క్లబ్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు వీటిని ఆసక్తితో తిలకించారు. డీన్‌లు, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

గురుకులాన్ని పరిశీలించిన జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ



పెదతాడేపల్లి గురుకుల పాఠశాలను పరిశీలించిన జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ శనివారం పరిశీలించారు. గురుకులంలో సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారు. వారి విద్యా నైపుణ్యాలను, ప్రాజెక్టులను తిలకించి, సంతృప్తి వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా విప్లవం వచ్చిందని పద్మశ్రీ చెప్పారు. ఈ సందర్భంగా పద్మశ్రీ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీడీఓ విశ్వనాథ్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ చైర్మన్ రవిజైన్, ప్రిన్సిపాల్ బి.రాజారావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రతాప్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనలవి తప్పుడు రాజకీయాలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు ఆగ్రహం



పెంటపాడు : తెలుగుదేశం, జనసేన పార్టీలు తప్పుడు రాజకీయాలు చేస్తున్నాయంటూ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆ పార్టీలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పెంటపాడు మండలం ప్రత్తిపాడు గ్రామంలో శనివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ పార్టీ అని చెప్పుకునే టీడీపీ తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేస్తే డిపాజిట్లు కూడా దక్కవని చేతులెత్తేసిందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ను గెలిపించడానికి టీడీపీ పోటీ నుంచి తప్పుకుందని విమర్శించారు. జనసేన పార్టీ తెలంగాణలో బీజేపీతో జతకట్టి ఎన్నికల్లో పోటీకి దిగుతోందన్నారు. ఒక పార్టీ తెలంగాణ ఎన్నికల్లో చేతులెత్తేస్తే, ఇంకో పార్టీ బీజేపీతో కలిసి పోటీ చేస్తోందని చెప్పారు. ఆ రెండు పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు హైదరాబాదులో చంద్రబాబు ఇంట్లో సమావేశమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి పది అంశాలతో ఉమ్మడి మినీ మేనిఫెస్టోను రూపొందించాలనుకోవడం వారి తప్పుడు రాజకీయాలకు నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. అసలు ఈ ఇద్దరు నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు కాదని, హైదరాబాదులో నివాసం ఉంటూ తెలంగాణకు చెందిన వారని మంత్రి కొట్టు ధ్వజమెత్తారు.

పురందేశ్వరిది బంధుప్రీతి, కులతత్వం

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీతో బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ కలిసే ప్రసక్తి లేదని ఆ పార్టీ కేంద్ర నాయకత్వం చెబుతుంటే ఇక్కడ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తన బావ చంద్రబాబును ఎలాగైనా బీజేపీకి దగ్గర చేయాలన్న బంధు ప్రీతితో, కులతత్వంతో కుట్రలు పన్నుతున్నారని మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ చేతులెత్తేసి కాంగ్రెస్ గెలవాలని పరోక్షంగా సహకరిస్తున్న చంద్రబాబు వైఖరిపై అతనితో అంటకాగుతోన్న పవన్ కళ్యాణ్ ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి కొట్టు డిమాండ్ చేశారు. టీడీపీ ప్రజలు సానుభూతి కోసం ఎన్ని డ్రామాలు ఆడినా రక్తి కట్టలేదని పేర్కొన్నారు. ప్రజలు టీడీపీ చెప్పే మాయమాటలకు మోసపోరని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ఒక కోటీ 62 లక్షల కుటుంబాలు ఎంతో సంతోషంగా ఉంటే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాత్రమే కడుపులో విషం పెట్టుకుని కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని డిప్యూటీ సీఎం కొట్టు తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఎన్టీఆర్ బిడ్డలు ఆయన చివర రోజుల్లో వ్యవహరించిన తీరు పట్ల ఎంతో దుఃఖించారన్నారు.

పురందేశ్వరి అవినీతి కూడా త్వరలోనే బయటికొస్తుంది

పురందేశ్వరి వందల కోట్లు దోచుకున్న దానిపై విజయ సాయిరెడ్డి ఎంతో విపులంగా మాట్లాడారని, ఆమె అవినీతి కూడా త్వరలోనే బయటకొస్తుందని మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. రెండెకరాల నుంచి ఆరు లక్షల కోట్ల రూపాయలకు చంద్రబాబు ఎలా ఎదిగారని ఆయన ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రజాధనాన్ని దోచేసే లక్షల కోట్లు అక్రమంగా సంపాదించారిని ఆరోపించారు. గత ఎన్నికల్లో ఓటింగ్ శాతంపై టీడీపీ, జనసేనలు కాకి లెక్కలు చెబుతున్నాయని అన్నారు. చంద్రబాబు జైలుకెళ్లాక టీడీపీ జీరో అయిపోయిందని జనసేన కార్యకర్తలు చెబుతుంటే, గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లను బట్టి జనసేన జీరోలో ఉందని టీడీపీ కార్యకర్తలు చెబుతున్నారని, ఈ ఇద్దరిలో ఎవరు జీరో ముందు తేల్చుకోవాలని ఆయన హితవుపలికారు. టీడీపీ, జనసేనల తప్పుడు రాజకీయాలను తిప్పి కొట్టాలని, మాయమాటలు నమ్మవద్దని మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గడపగడపకు సంక్షేమం



పెంటపాడు : మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో మహిళ పొందిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



అత్తిలి : మండలంలోని బల్లిపాడు గ్రామంలో లబ్ధిదారులకు పథకాల బ్రోచర్ అందిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్
- తయారీ కేంద్రాల లైసెన్సుల రద్దు



తణుకు: రాబోయే దీపావళిని పురస్కరించుకుని బాణసంచా వ్యాపారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తణుకు అగ్నిమాపక కేంద్రం అధికారి ఐ.అజయ్‌కుమార్ హెచ్చరించారు. ఇప్పటి వరకు తణుకు అగ్నిమాపక కేంద్రం పరిధిలో 12 మందికి హోల్‌సేల్ లైసెన్సులు మంజూరు చేశామన్నారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. గతంలో తణుకు మండలం దువ్వ గ్రామంలో రెండు ప్రాంతాలు, వేల్పూరు గ్రామంలో ఒక ప్రాంతంలో 600 కిలోల వరకు మాత్రమే బాణసంచా తయారీకి అనుమతులు ఇచ్చామన్నారు. అయితే గతేడాది తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామంలో తయారీ కేంద్రంలో జరిగిన భారీ విస్ఫోటనాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది జిల్లాలోని మొత్తం తయారీ కేంద్రాల అనుమతులు రద్దు చేశామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో నిబంధనలను అతిక్రమిస్తే యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

2 లక్షల కిలోల వరకు విక్రయం

తణుకు అగ్నిమాపక కేంద్రం పరిధిలోని తణుకు, ఇరగవరం మండలాలతోపాటు ఉండ్రాజవరం మండలంలోని కొద్ది భాగంలో మొత్తం 12 మంది హోల్‌సేల్ వ్యాపారులకు అనుమతులు జారీ చేశామన్నారు. దువ్వ గ్రామంలో 2 లక్షల కిలోల వరకు బాణసంచా విక్రయించుకునేందుకు అనుమతి ఇవ్వగా.. ఐదు వేల కిలోల విక్రయానికి ఒకరికి, 1500 కిలోల బాణసంచా విక్రయానికి ఆరుగురికి, 600 కిలోల వరకు బాణసంచా విక్రయానికి నలుగురికి అనుమతులు ఇచ్చామని వివరించారు. రెండు గోదాములకు అనుమతులు ఇచ్చామన్నారు. ఆయా గోదాములు, దుకాణాల వద్ద నీరు, ఇసుకతోపాటు మంటలను అదుపు చేసే పరికరాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రిటైల్ వ్యాపారులకు అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేసినట్టు సమాచారం ఉంటే ఫైర్, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. బాణసంచా విక్రయాలపై నిత్యం పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు

సాక్షి, భీమవరం: డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిపై ఉక్కుపాదం మోపుతున్నట్టు ఎస్పీ యు.రవిప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3, 4 తేదీల్లో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మద్యం సేవించి వాహనాల నడుపుతున్న తొమ్మిది మందిపై కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిపై 65 కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల భద్రత, నేర నియంత్రణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్‌ను మరింత కట్టుదిట్టంచేసి ప్రత్యేకంగా పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ముఖ్యకూడళ్లలో ముమ్మరంగా వాహన తనిఖీలు, హెల్మెట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

యోగా పోటీల్లో దండగర్ర విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వీరవాసరం జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన 67వ అంతర జిల్లా స్థాయి యోగా పోటీల్లో తాడేపల్లిగూడెం మండలం దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ విషయాన్ని స్కూల్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ శనివారం తెలిపారు. చెరుకు వడ్డికాసులు (9వ తరగతి), మైనం కోట లక్ష్మి (7వ తరగతి), కరుబోతు హేమంత్ (6వ తరగతి), పసుపులేటి రాజేష్ (6వ తరగతి)లు ప్రశంసా పత్రాలు పొందిన వారిలో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా వారిని హెచ్ఎం చంద్రశేఖర్, యోగాటీచర్ సూర్య, వ్యాయామోపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్, ఉపాధ్యాయలు అభినందించారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పెంటపాడు: మండలంలోని పెంటపాడుశాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కర్రి వరహాలరెడ్డి, గ్రంథాలయాధికారి మహ్మద్ జుల్ఫికర్ ఆలీ లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా పలు సామాజిక సాహితీ కార్యక్రమాలతో పాటు, విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్‌పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాల్లో అన్ని పాఠశాలల విద్యార్థులు, చదువరులు తప్పక విజయవంతం చేయాలని కోరారు.

నేడు, రేపు ఓటరు నమోదు కార్యక్రమం



తణుకులో పోలింగ్ బూత్ వద్ద ఓటు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కె చెన్నయ్య

తణుకు టౌన్: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో బాగంగా తణుకు నియోకవర్గంలోని పలు పోలింగ్ బూత్‌లలో ఓటరు నమోదుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం, ఆదివారాల్లో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శనివారం తణుకులో జరుగున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తాడేపల్లిగూడెం ఆర్డీవో కె చెన్నయ్య శనివారం పరిశీలించారు. శనివారం తణుకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బూత్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్, రెవిన్యూ సిబ్బంది, బూత్ లెవిల్ అధికారులు పాల్గొన్నారు.

పదవీకాలం పొడిగింపు పట్ల హర్షం

పెంటపాడు: ఏపీ రాష్ట్ర క్రిష్టియన్(మైనారిటీ) ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేస్తున్న బొల్లవరపు జాన్‌వెస్లీ పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో రెండేళ్లు పొడిగించడం పట్ల రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు జీజే జ్యోతి ఆనంద్ ఒక ప్రకటనలో హర్షం తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రెండోసారి పదవీ పొడిగింపు పట్ల కార్పొరేషన్ చైర్మన్‌కు ఆనంద్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



పెంటపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ అధికారులు

పెంటపాడు: మండలంలోని పెంటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు మాట్లాడుతూ దోమ కాటుతో ఫైలేరియా తదితర వ్యాధులు సంభవిస్తాయన్నారు. పరిసరాల పరిశుభ్రతే దోమల నివారణకు మార్గమన్నారు. మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రతో పాటు, ప్రతి ఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరాలు ఉన్నవారికి తక్షణం అన్ని సచివాలయాల్లోని ఆరోగ్య కేంద్రాలను సంప్రదించి చికిత్సలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య అధికారి సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి కేవీ రామారావు, మీసాల సాయిబాబా, సుజాత, కాంతారావు, ఆశలు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ జగనన్న రావాలన్నదే ప్రజల ఆకాంక్ష

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- ప్రత్తిపాడులో గడపగడపకు మన ప్రభుత్వం



ప్రత్తిపాడు గ్రామంలో మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: జగనన్న మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, ఇందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి లభిస్తున్న అనూహ్య స్పందనే కారణమని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. పెంటపాడు మండలం ప్రత్తిపాడు గ్రామంలో శనివారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో టీడీపీ అధినేత అధికారం అడ్డు పెట్టుకొని విచ్చలవిడి దోపిడీలు చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల వ్యవస్థ, రైతుల అభ్యున్నతి కోసం ఆర్బీకేల వ్యవస్థలను ఏర్పాటు చేసి వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు తప్పుడు రాజకీయలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, పార్టీ అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, వీర్ల గోవింద్, వీర్ల వెంకటేష్, వీర్ల రామచంద్రరావు, సత్యనారాయణ, కండెల్లి వెంకట్రావు, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, వైస్ చైర్మన్ చినబాబు, సొసైటీ అధ్యక్షులు గుండుమోగుల సాంబయ్య, దుర్గ అమ్మవారి ఆలయ చైర్మన్ సైపురెడ్డి రాంబాబు, తూము చిన్న, బడేటి భాను, దాసరి ప్రవీణ, జవ్వాది శేషగిరి, తహసిల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ, దేవ వెంకటరమణ, ములగాల బాబ్జి, చల్లా కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే సీఎం జగన్ అజెండా

- రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి
- బల్లిపాడులో గడపగడపకు మన ప్రభుత్వం



బల్లిపాడులో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్‌పర్సన్

అత్తిలి: ప్రతి గడపకు సంక్షేమాన్ని అందించాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని రాష్ట్రపౌరసరఫరాలశాఖా మంత్రికారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. అత్తిలి మండలం బల్లిపాడు, కె సముద్రపుగట్టు గ్రామాల్లో శనివారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూరిందన్నారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ చక్కని పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మీరంతా అండగా నిలిచి, రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ , అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ అడ్డాల జానకి, సర్పంచ్‌లు కసిరెడ్డి బాలాజీ, బండి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అద్దంకి శ్రీను, మాజీ సర్పంచ్ ఆకుల పండుస్వామి, ఉపసర్పంచ్ తలారి శ్రీనివాస్, ట్రస్టుబోర్డు చైర్మన్ తోట వెంకటేశులు, సొసైటీ అధ్యక్షుడు గుబ్బల ఆంజనేయులు, మాజీట్రస్టుబోర్డు చైర్మన్‌లు ధనుమూరి తాతాజీ, ఆకుల బులినాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దాల శ్రీనివాస్, శింగంశెట్టి శ్రీనివాస్, కూనపరెడ్డిజయరాజు, పెన్మెత్స రామరాజు, వెలగల అమ్మిరెడ్డి, రాయుడు ధర్మారావు, కొమ్మర రామారావు తదితరులు పాల్గొన్నారు.

రూ. 80లక్షలతో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

బల్లిపాడు గ్రామంలో రూ. 80లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, రెండు కమ్యూనిటీ హాల్ భవనాలను రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, జడ్పీ చైర్ పర్సన్ గంటా పదశ్రీ ప్రారంభించారు.

పేదల ఆరోగ్యానికి సీఎం జగన్ భరోసా



పడాల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: పేద ప్రజల ఆరోగ్యానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని పడాల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బిడ్డల్ని ఆడ, మగ అనే తేడా లేకుండా సమానంగా చూడాలన్నారు. ఆడపిల్లల్ని బాగా చదివించాలన్నారు. బాలికలకు 21 ఏళ్లు వచ్చిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. ఆ లోపు వివాహాలు చేయడం వల్ల వారి ఆరోగ్యంలో సమస్యలు వస్తాయన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని బాలికల వివాహాలను సరైన సమయంలో చేయాలన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రవేశపెట్టారన్నారు. ఒక కుటుంబం బాగుంటే రాష్ట్రం, దేశం బాగుంటుందన్నారు. ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధనే సీఎం జగన్ లక్ష్యమన్నారు. ఆరోగ్య శిబిరాల్లో ఏడు రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందజేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం 885 మంది రోగులకు శ్రీహర్ష, సింధూ, టి.విజయ సృజిత్, ఎస్‌కే.అస్మత్ ఉన్నీసా బేగంలు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి కే.శ్రీనివాస్, విద్యాకమిటి చైర్ పర్సన్ గారపాటి గంగాభవాని, నాయకులు కామిశెట్టి కృష్ణవినోద్, పులి సూర్యప్రసాద్, లింగంపల్లి వేమన, పులి గోపాలకృష్ణ, విప్పర్తి ఆనందరావు, విప్పర్తి కుటుంబరావు, వీవోఏ నేతల వెంకటలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి, సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



లబ్ధిదారులకు సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ డాక్టర్ శామ్యూల్, తదితరులు

తాడేపల్లిగూడెం అర్బన్ : జగనన్న కాలనీల్లో స్థలాలు పొందిన లబ్ధిదారులు త్వరితగతిన గృహాలు నిర్మించుకోవాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ తెలిపారు. స్థానిక జగనన్న కాలనీ ఆర్ -12 లేఅవుట్‌లో స్థలాలు పొందిన లబ్ధిదారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆర్-12 లేఅవుట్‌లో 612 మందికి స్థలాలు అందజేయగా 278 మంది లబ్ధిదారులు మాత్రమే గృహ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. మిగిలిన 334 మంది కూడా ఈనెల 20నాటికి గృహ నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. లబ్ధిదారులు గృహనిర్మాణాలు చేపట్టేందుకు సచివాలయాల ఎమినిటీ సెక్రటరీలు, గృహనిర్మాణ శాఖ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులు గృహనిర్మాణాలను త్వరితగతిన చేపట్టేందుకు మున్సిపల్ అధికారులను మూడు బృందాలుగా ఏర్పాటు చేశామని శామ్యూల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి గృహనిర్మాణ శాఖ డీఈ కేవీవీఎస్ ప్రసాద్, మున్సిపల్ డిఈ నాయక్, ఏఈ వైవీ వెంకట్రావు, మెప్మా సీఎంఎం శ్రీనివాస్, ఆయా వార్డుల సచివాలయ సెక్రటరీలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 19 నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

తణుకు టౌన్: మండలంలోని జగనన్న కాలనీల్లో ఈనెల 19వ తేదీలోగా మిగిలిన గృహల నిర్మాణాలను ప్రారంభించాలని మండల గృహ నిర్మాణ ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు కోరారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని వేల్పూరులోని జగనన్న కాలనీని సందర్శించి ఇళ్ల నిర్మాణం పురోగతి, కాలనీలో రోడ్డుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీల్లో సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని వారిని ఆప్షన్ 3లో నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసమావేశంలో హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, ఈవోపీఆర్‌డీ, గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో భవన్స్ విద్యార్థి ప్రతిభ




జాతీయ స్థాయి యోగాసన పోటీలకు ఎంపికైన ఆదిత్యవర్ధన్ అభినందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్ విద్యార్థి ఎస్.ఆదిత్యవర్ధన్ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో అగర్తలలో జరగనున్న యోగాసన పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రాజీవ్‌కుమార్ శర్మ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యా సంస్థ చైర్మన్ చెరుకువాడ శ్రీరంగనాథరాజు (రంగరాజు), పాలకవర్గ ఉపాధ్యక్షుడు చెరుకువాడ నరసింహరాజు, కమిటి సభ్యులు గోపాలకృష్ణంరాజు, గ్రంధి సాయిబాబావరప్రసాద్, పీఎస్ఎన్.మూర్తి, శివరామరాజు, హెడ్ మిస్ట్రెస్, ఉపాధ్యాయులు అభినందించారు.

పేదల వైద్యానికి పెద్దపీట వేస్తున్న సీఎం జగన్

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల వైద్యానికి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పేద, మధ్యతరగతి వర్గాలందరికీ ఉచితంగా సత్వర వైద్యసేవలందిస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో వివిధ శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారని స్పష్టం చేశారు. **బాధితులకు అండగా సీఎం జగన్..**

ఇటీవల తాళ్లరేవు మండలం గోపులంక గోదావరిలో మునిగిపోయిన తణుకుకు చెందిన నలుగురు యువకులు, పేరుపాలెం బీచ్‌లో మునిగి మృతిచెందిన ముగ్గురి కుటుంబాలకు సంబంధించి ఒక్కొక్కరికి రూ. 3 లక్షలు చొప్పున సాయం అందచేద్దామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించినట్లు మంత్రి కారుమూరి తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఇల్లింద్రపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, ఇరగవరం మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం అభినందనీయం



స్కేటింగ్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులతో మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: విద్యకే ప్రాధాన్యతనిచ్చే నేటి రోజుల్లో క్రీడల్లో కూడా రాణిస్తున్న తీరు అభినందనీయమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం తణుకు మాంటిస్సోరీ స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 35వ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్ రోలర్ ఇన్‌లైన్ హాకీ, ఆర్టిస్టిక్ పోటీలకు మంత్రి కారుమూరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి ప్రైవేటు పాఠశాలల తీరు చదువు చదువు అనే రీతిలో ఉన్నప్పటికీ తణుకు మాంటిస్సోరీ స్కూల్ యాజమాన్యం తమ క్రీడా ప్రాంగణంలో అంతర్జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలు, సింథటిక్ బాస్కెట్ బాల్ కోర్టులు నిర్వహించే విధంగా ఏర్పాటు చేసిన తీరును ప్రశంసించాల్సిందేనన్నారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ట్యాలెంట్ వెలికితీసి క్రీడలపట్ల ఆసక్తిని కనబరిచే విధంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పాఠశాలల యాజమాన్యాలు, తల్లితండ్రులపై ఉందన్నారు. అనంతరం ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఏసియన్ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన స్కేటర్స్‌కు అసోసియేషన్ ప్రకటించిన నగదు ప్రోత్సాహకాలను మంత్రి కారుమూరి చేతులమీదుగా అందచేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన రోలర్, ఇన్‌లైన్ హాకీ క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. మాంటిస్సోరీ స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు, ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ముఖ్య కార్యదర్శి డి.భగీరథ్, అదనపు కార్యదర్శి పి.థామస్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, కళాశాలల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

వాసవీ ఇంజనీరింగ్ కళాశాలకు ఐఎస్ఓ పురస్కారాలు



ఐఎస్ఓ పురస్కారాన్ని అందుకుంటున్న వాసవీ ఇంజనీరింగ్ కళాశాల బాధ్యులు

తాడేపల్లిగూడెం: పెదతాడేపల్లిలోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలకు మూడు విభాగాల్లో ఐఎస్ఓ పురస్కారాలు లభించాయని శనివారం పాలక మండలి సభ్యులు విలేకర్లకు తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, నాణ్యమైన విద్యను అందించినందుకు ఈ పురస్కారాలను అందిస్తున్నట్టు కళాశాలలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హైద్రాబాద్‌కు చెందిన ఐఎస్ఓ సర్టిఫికేషన్ ఆడిట్ సంస్థ హిమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత ఆలపాటి శివయ్య ఈ అవార్డులను పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు, పేరూరి బాలకాశియ్యలకు అందించారు. ఈ సందర్భంగా సందర్భంగా శివయ్య మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రమాణాలపై సర్టిఫికేషన్ కోసం ఆడిట్‌ను నిర్వహించిందన్నారు. వీటి ఆధారంగా సర్టిఫికేషన్ ఇచ్చినట్టు చెప్పారు. నాణ్యత అనేది నిరంతర ప్రక్రియ అని విద్యాసంస్థల్లో ఎప్పటికప్పుడు ప్రమాణాలతో పాటు మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జీవీమాల్‌తో గూడెంకు కొత్తశోభ



జీవీమాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి



జీవీమాల్‌లో సందడి చేస్తున్న సినీనటి అనసూయ

తాడేపల్లిగూడెం: జీవీ మాల్ రాకతో గూడెం పట్టణానికి కొత్తశోభ వచ్చిందని డిప్యూటీ సీఎం , దేవదాయశాఖామంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జీవీమాల్‌ను పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. వాణిజ్యపరంగా ముందువరుసలో ఉన్న పట్టణంలో మాల్స్‌రావడం అభివృద్ధికి నిదర్శనమన్నారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ మాల్ ఏర్పాటుతో గూడెం వాణిజ్యపరంగా మరో ముందు అడుగు వేసిందన్నారు.పట్టణంలో జీవీమాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన సినీనటి అనసూయ శనివారం కొద్దిసేపు ఇక్కడ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ భాద్యులు ఉమామహేశ్వరరావు, వాసు, మధు, వైసీపీ నాయకులు మారం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సమాజానికి పోరాటాలు



తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం గ్రామంలో జరిగిన సభ దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పీడిత ప్రజల విముక్తి, వారి హక్కుల రక్షణ, మెరుగైన సమాజం కోసం పోరాటాలు జరుగుతున్నాయని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకుడు మామిడి దానవరప్రసాద్ పేర్కొన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి దానవరప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొద్దిమంది కార్పొరేట్ సంస్థల కోసం దేశ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దేశ సంపదను కారుచౌకగా అమ్మేస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెరుగైన జీవన విధానం కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టి.దుర్గారావు, ఎం.సత్తిపండు, నాగరాజు, మంచాల శ్రీనివాస్, దువ్వ దానయ్య, ఎస్.కొండయ్య, కోటి, గుణ్ణం ప్రసాద్, సురేష్, సత్తియ్య పాల్గొన్నారు.

నేడు అత్తిలిలో మంత్రి కారుమూరి పర్యటన

అత్తిలి: మండలంలోని పాలూరు గ్రామంలో ఆదివారం ఉదయం జరిగే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయ భవనాలను మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

తణుకు అర్బన్: వచ్చేనెల 9వ తేదీన తణుకు కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి పేర్కొన్నారు. తణుకు కోర్టులో శనివారం కోర్టు పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఎక్కువ కేసులు పరిష్కరించే దిశగా పోలీసు అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ రంజిత్‌కుమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



షాజహాన్ కుటుంబ సభ్యులకు బీమా సొమ్ము అందజేస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని బీసీకాలనీలోని షేక్ షాజహాన్(35) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. అతనికి వైఎస్సార్ బీమా వర్తింపులో భాగంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా మృతి చెందిన షాజహాన్ కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పిన గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా సొమ్ము అందించారు. ఈ మొత్తాన్ని షాజహాన్ బార్య షేక్ మీరాబీకి అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, వార్డు సభ్యులు భర్ల జయరాంబాబు పాల్గొన్నారు.